
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
3
శనివారం 13 జూలై 2024



మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కోటపల్లి, జూలై 12: ఎస్సీ సొసైటీలోని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకార్ క్రీడ నోడల్ ఆఫీసర్ డాక్టర్ టీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మల్లంపేటలో ఎస్సీ మహిళ సొసైటీ సభ్యులకు వందశాతం సబ్సిడీపై కోళ్లఫారంలను అందించారు. ఆయన మాట్లాడుతూ ఈ పౌల్ట్రీకేజెస్‌లో కోళ్లను పెంచుకుని ఆర్థికంగా ఎదగాలని తద్వారా పొదుపు చేసుకోవాలని సూచించారు. ఐకార్ క్రీడ అధికారి అనిత, ఎస్సీ సబ్‌ప్లాన్ కో ఆర్డినేటర్ సంపత్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



కాలేజ్‌రోడ్ గోదావరి నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- గోదావరి నది తీరం నుంచి యథేచ్ఛగా తరలింపు
- ట్రాక్టర్‌కు రూ.3 నుంచి రూ.4వేల వరకు విక్రయం
- నాయకుల అండదండలతో సాగుతున్న దందా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మంచిర్యాల అర్బన్, జూలై 12 : జిల్లాలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో నదీ తీరాలు, వాగుల నుంచి రాత్రీ, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. హాజీపూర్ మండలంలోని వేం పల్లి ఇసుక రీచ్, చెన్నూరులోని బతుకమ్మ వాగు, నెన్నెల మండలం లోని కర్జీ వాగుల నుంచి మాత్రమే ఇసుకను తరలించేందుకు అనుమతులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్ గౌతమేశ్వర ఆలయం, పాత మంచిర్యాల, నస్పూర్‌లోని సీతారాంపల్లి, తాళ్లపల్లి, జైపూర్‌లోని ఇందారం, దండేపల్లి ప్రాంతాల్లోని గోదావరి నదీ తీరాల నుంచి అక్రమార్కులు రోజు వందలాది ట్రిప్పుల ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తూ ఓ ఖాళీ ప్రదేశంలో డంప్ చేస్తున్నారు.

15 రోజులుగా వేంపల్లి ఇసుక రీచ్ నడవకపోయినప్పటికీ ఇసుక రవాణా మాత్రం కొనసాగుతోంది. అక్రమంగా తరలించిన ఇసుకను ట్రాక్టర్ ట్రిప్‌కు రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎలాంటి స్లాట్ బుకింగ్ లేకుండానే విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అవసరం ఉన్న వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి వుంటుంది. ఆన్‌లైన్ డబ్బుల చెల్లింపు జరిగిన తర్వాతే వే బిల్ ద్వారా ఎస్ఎండీసీ అధికారులు ఇసుకను సంబంధిత వ్యక్తులకు రవాణా చేస్తారు. జిల్లాలో ఇసుక ట్రిప్పుల తరలింపులో అలాంటి పరిస్థితులు ఏమీ కనిపించడం లేదు. అక్రమ ఇసుక రవాణా కొందరు ప్రజాప్రతి నిధులు, నాయకుల అండదండలతోనే సాగుతోందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగానే అక్రమ రవాణా దారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పాత మంచిర్యాలలోని ఖాళీ ప్రదేశాల్లో ఇసుక డంప్

పాత మంచిర్యాలలో ఇసుక డంప్‌లు

అక్రమ ఇసుక రవాణా జిల్లా వ్యాప్తంగా ఒక ఎత్తయితే పాత మంచి ర్యాలలో మరొకటని చెప్పొచ్చు. ఆ ప్రాంతంలోని ఇసుక రవాణాదారులు రాత్రంతా వందలాది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను తరలిస్తూ ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇసుక కుప్పలు దర్శన మిస్తున్నాయి. అక్రమ డంప్‌ల పట్ల చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అడ్డుకునేందుకు చర్యలు: మైనింగ్ ఏడీ మోహన్‌రెడ్డి

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇసుక రీచ్‌ల నుంచి కాకుండా అనుమతులు లేని ప్రాంతాల నుంచి తరలిస్తున్న అక్రమార్కులపై కొరడా ఝుళిపిస్తున్నాం. అక్రమంగా ఇసుకను తర లిస్తూ మొదటి సారి పట్టుబడితే రూ.5వేలు, రెండోసారి పట్టుబడితే రూ.15 వేల జరిమానా విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తున్నాం. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ అక్రమ రవాణాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు కృషి చేస్తాం.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మైనింగ్ ఏడీ

చెన్నూరు, జూలై 12: ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కోటపల్లి మండలం కొల్లూరు ప్రాంతంలోని ఇసుక రీచ్‌లను సందర్శించినట్లు పేర్కొన్నారు. కొల్లూరులో మూడు ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఆన్‌లైన్ పద్ధతిలో బుకింగ్‌లు కొనసాగుతుండగా రోజుకు 270 నుంచి 300 లారీల ఇసుక రవాణా జరుగుతుందని, దీని ద్వారా రోజుకు ప్రభుత్వానికి రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడినా, ఓవర్ లోడ్ చేసినా ఉపేక్షించమన్నారు. జైపూర్ మండలంలో 130, చెన్నూరు మం డలంలో 300 ట్రాక్టర్ల అక్రమ ఇసుకను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలి పారు. అక్రమరవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు.

కస్తూర్బాలో గోరింటాకు సంబరాలు



గోరింటాకు పెట్టుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

దండేపల్లి, జూలై 12: కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం గోరింటాకు సంబురాలను నిర్వహించారు. గోరింటాకుతో ఆరోగ్యం చేకూరు తుందని విద్యాలయ ప్రత్యేకాధికారి మంజుల అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మైదాకును తయారు చేసి చేతులకు పెట్టుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అంతకు ముందు వన మహోత్సవం భాగంగా మొక్కలు నాటారు.

ఆదర్శ పాఠశాలలో వన మహోత్సవం

మందమర్రిరూరల్, జూలై 12: మండలంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, అప్పుడు భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించ గలుగుతామన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠాలు బోధించేవారేరి..?

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- నియామకాలు లేక ఇబ్బందులు
- విద్యావాలంటీర్ల ఏర్పాటుపై స్పష్టత కరువు
- బదిలీలు, ప్రమోషన్‌లతో మరిన్ని ఖాళీలు



బెల్లంపల్లి, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా పాఠాలు జరగడం లేదు. దీంతో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారుతోంది. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చదువు ఎలా సాగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడం, బదిలీల్లో గతంలో ఆయా పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులు పదోన్నతిపై వేరో పాఠ శాలకు వెళ్లడం.. అక్కడకు మరో ఉపాధ్యాయుడు రాకపోవడం వంటి కారణాలతో విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. ప్రభుత్వం విద్యా వాలంటీర్ల నియామకాలపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలోని పలు పాఠశాలల్లో చాలీ చాలని ఉపాధ్యాయులతో చదువులు నెట్టుకొస్తున్న దుస్థితి నెలకొన డంతో విద్యార్థులు, తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2874 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా 2332 మంది మాత్రమే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 542 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు 446 మంది ఇతర పాఠశాలలకు వెళ్లగా వారి స్థానాల్లో ఇప్పటి వరకు 417 మంది మాత్రమే వచ్చారు. జిల్లా లోని మారుమూల ప్రాంతాల్లో ఎస్‌జీటీల బదిలీలు చేపట్టి రిలీవ్ ఇవ్వక పోవడంతో ఎక్కడి వారు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడంతో పాఠాలు బోధించే వారు కరువవుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత

జిల్లాలోనిపలు పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంతో సంబంధం లేకుండా ప్రాథమిక పాఠశాలల్లో 30, ఉన్నత పాఠశాలల్లో 40 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారు. ప్రాథ మిక పాఠశాలల్లో తరగతులతో సంబంధం లేకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్లను ఇస్తున్నారు. పలు పాఠశాలల్లో 100 నుంచి 200 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నాలుగు నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం ఉండగా, కేవలం ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల విద్యా ర్థులకు ఒకే ఉపాధ్యాయుడు బోధించాల్సి వస్తోంది. ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారుతోంది.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 1076 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలు 588, ప్రాథమికోన్నత పాఠశాలలు 179, ఉన్నత పాఠశాలలు 280 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 97,889 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈయేడు బడిబాటలో భాగంగా 2214 మంది బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించారు. అలాగే 499 మంది ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. రేషనలైజేషన్ ప్రకారం 1 నుంచి 19 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 20 నుంచి 60 మంది విద్యార్థులకు ఇద్దరు, 61 నుంచి 90 మందికి ముగ్గురు, 91 నుంచి 120 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉండాలి. యేటా ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాటతో పాటు కొత్తగా విద్యార్థులు పాఠశాలల్లో చేరుతున్నారు. జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 236 ఉన్నాయి. ఈ పాఠశాలల్లోని బోధన అస్త వ్యస్తం గా మారుతోంది. ఉపాధ్యాయుడు సెలవుపై, సమా వేశానికి వెళ్లినా ఆ రోజు పాఠాలు బోధించేవారు కరువవుతున్నారు.

విద్యావాలంటీర్ల నియామకాలపై స్పష్టత కరువు

విద్యావాలంటీర్ల నియామకాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలా కొంత డబ్బులు వేసుకుని విద్యావాలంటీర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో పూర్తిస్థాయిలో తరగతి గదులు లేకపోవడంతో ఒకే గదిలో వేర్వేరు తరగతులను నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన సక్రమంగా జరిగేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



సబ్బని రాజేంద్ర ప్రసాద్, విద్యార్థి సంఘం నాయకుడు

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలి. ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థు లు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా వాలంటీర్లను నియమించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సరైన సమయానికి పాఠశాలలకు రావడం లేదు.

ఖాళీ పోస్టులపై నివేదికలు అందించాం



డీఈవో యాదయ్య

జిల్లాలో ఉపాధ్యాయుల ఖాళీ పోస్టులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో నియమిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పాఠశాలలను సందర్శిస్తున్నాం. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలి.

ప్రజల నెత్తిన కుచ్చుటోపి

- నగల షాపుల్లో అక్రమ స్కీంలు, వడ్డీ వ్యాపారం
- వందలాది మందితో సభ్యత్వాల సేకరణ
- బోర్డులు తిప్పేస్తున్న వ్యాపారులు
- తాజాగా రూ. 10 కోట్లతో జువెల్లరీ యజమాని పరార్
- జిల్లా కేంద్రంలో వరుస ఘటనలు



మంచిర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మా స్కీముల్లో సభ్యులుగా చేరండి... మీ ఇంటిని స్వర్ణమందిరంగా మార్చుకోండి... అంటూ ప్రకటనలు గుప్పిస్తూ అందినంత దండుకుంటున్నారు వ్యాపారులు. వస్త్ర దుకాణాలు, వాహనాల షోరూంలు, జువెల్లరీ షాపులో అక్రమ స్కీంలు, వడ్డీ వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నాయి. లాటరీల పద్ధతిలో బహుమతి గెలుచుకోండి.... మిగతా వాయిదాలు చెల్లించాల్సిన అవసరం లేదంటూ ప్రజలను మభ్యపెడుతూ కోట్లలో డబ్బులు ఆర్జిస్తున్నారు. మొదట సక్రమంగా లాటరీల ద్వారా విజేతలను ఎంపిక చేస్తూ అనంతరం అందినకాడికి దండుకుని బోర్డులు తిప్పేస్తున్నారు. జిల్లా కేంద్రంలో తాజాగా మరో వ్యాపారి బోర్డు తిప్పేసిన వైనం వెలుగులోకి వచ్చింది.

సభ్యులకు టోకరా ఇలా...

నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు కిస్తులు చెల్లించే విధంగా స్కీములు రూపొందించి 10 నెలలు కాలపరిమితితో సభ్యులను చేర్చుకుంటారు. స్కీముల్లో చేరిన సభ్యుల నుంచి నెల కిస్తుల రూపంలో కోట్లాది రూపాయలను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. స్కీముల్లో చేరిన సభ్యులు డ్రాలో వస్తువు పొందినట్లయితే మిగతా కిస్తులు చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో సహజంగానే వాటివైపు మొగ్గుచూపుతూ నిలువునా మోసపోతున్నట్లు తెలుస్తోంది. డ్రాలో గెలుపొందిన వ్యక్తికి వ్యాపారులు నిర్ణయించే బహుమతి తప్ప డబ్బులు, ఇతర వస్తువులు తీసుకునే వెసులుబాటు ఇవ్వరు. మొదట్లో డ్రాలు సక్రమంగానే నిర్వహిస్తున్న వివిధ షాపుల యజమానులు అనంతరం నష్టాల పేరుతో చేతులెత్తేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

బోర్డులు తిప్పేస్తున్న నిర్వాహకులు...

జిల్లా కేంద్రంలోని పద్మావతి జువెల్లరీ షాపు నిర్వాహకులు స్కీముల పేరుతో పెద్ద మొత్తంలో సభ్యుల నుంచి డబ్బులు సేకరించి బోర్డు తిప్పేశారు. ఇందులో చేరిన వందలాది మంది బాధితులు పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయింది. స్టేషన్‌రోడ్‌లోని మరో జువెల్లరి షాపు కొంతకాలంగా తెరవకపోయే సరికి స్కీంలో చేరిన సభ్యులు ఆందోళన చెందారు. గతంలో పెద్ద ఎత్తున స్కీములు నిర్వహించి నష్టాల పాలైన పట్టణానికి చెందిన చిలువేరు శ్రీకాంత్ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తాజాగా జిల్లా కేంద్రంలోని శ్రీతుకారాం జువెల్లర్స్ యజమానులు రెండు రోజుల క్రితం బోర్డు తిప్పేయడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. షాపు యజమాని, అతని ఇద్దరు కుమారులు కొంతకాలంగా నగల దుకాణం నిర్వహిస్తున్నారు. నగల తయారీ కోసం పెద్ద మొత్తంలో బంగారం, డబ్బులు తీసుకున్నారు. అలాగే తెలిసిన వారి నుంచి భారీగా అప్పు చేసినట్లు తెలుస్తోంది. సేకరించిన డబ్బులను షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. నగలు, డబ్బులు ఇచ్చిన వారు ఒత్తిడి తెస్తుండటంతో వారం రోజుల క్రితం యజమాని కుమారుడు పరార్ అయ్యాడు. తండ్రిపై ఒత్తిడి పెరగడంతో రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. రెండు రోజులుగా షాపు మూసి ఉండటంతో పరారైనట్లు తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటనలో నిర్వాహకులు దాదాపు రూ.10 కోట్లకు పైగా అప్పులు చేసి ఉడాయించినట్లు భావిస్తున్నారు.

పండగ రోజుల్లో అధికం...

దసరా, దీపావళి తదితర పండగలతోపాటు ఆషాడం, శ్రావణ మాసాలను పురస్కరించుకుని స్కీంల నిర్వాహకులు మరిన్ని ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రజలకు కుచ్చుటోపీ పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ధరల తగ్గుదల పేరుతో వినియోగదారులను ఆకర్షించేందుకు ప్రకటనలు గుప్పిస్తూ స్కీంలలో చేర్పించుకుంటున్నారు. ఈ విషయమై పోలీసులు దృష్టి సారించి స్కీంలు నిర్వహించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణంతో నిరంతర విద్యుత్ సరఫరా



చెన్నూరులో సబ్‌స్టేషన్ కంట్రోల్‌రూంను స్విచాన్ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మందమర్రిలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చెన్నూరు, జూలై 12: సబ్‌స్టేషన్ నిర్మాణంతో వినియోగదారులకు నిరంతరం విద్యుత్ సరఫరా అవుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిలు అన్నారు. నల్లగొండపోచమ్మ కాలనీలో రూ.1.60 కోట్లతో నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో లోఓల్టేజీ సమస్య, విద్యుత్ అంతరాయం ఉండదన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈలు కైజర్, పెద్దిరాజం, ఏడీఈలు రవికుమార్, యాదగిరి, వెంకటేశ్వర్లు, శరత్, శ్రీనివాస్, పాల్గొన్నారు. వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలని కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. శ్రీనివాసచారి, శ్రీనివాస్‌రెడ్డి,మూల రాజిరెడ్డి, భద్రయ్య, రవి పాల్గొన్నారు.

జైపూర్: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. రైతువేదికలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో కలిసి 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీ నిధులను మండలానికి కేటాయించి అన్ని గ్రామాలను అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు. మండల కేంద్రంలో తాటిపెల్లి శ్రీనివాస్ కుమారుడు హరీష్ బుధవారం హైద్రాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి శుక్రవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కోటపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ అన్నారు. నక్కలపల్లిలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, ఎంపీడీవో ఆకుల భూమన్న, గ్రామప్రత్యేకాధికారి రవి, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో రూ.10 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ భవనాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. మత్స్యశాఖ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. రామన్ కాలనీ పై ఓవర్ బ్రిడ్జిని ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేమాట్లాడుతూ తాగునీరు, డ్రైనేజీల, ఇతర పనుల కోసం రూ. 2 కోట్లు కేటాయించామని, అదనంగా మరో రూ. 4 కోట్లు కేటాయిస్తా మన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయ కులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్లు, గ్లాసులు స్వాధీనం

నస్పూర్, జూలై 12 : మున్సిపాలిటీ పరిధిలో మద్యం షాపుతోపాటు 10 కిరాణ దుకాణాలపై మున్సిపల్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి ప్లాస్టిక్ గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 ప్రకారం వ్యాపారులకు రూ.11వేల జరిమానా వేసినట్లు కమిషనర్ చిట్యాల సతీష్ తెలిపారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ సంచులు, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడవద్దని సూచించారు. ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రశాంత్, బిల్ కలెక్టర్ లింగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, జూలై 12: నస్పూర్, ఆర్కే-6 సబ్‌స్టేషన్లు, 33 కేవీ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రాంమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

కాసిపేట: కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ స్వర్ణలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెన్నూరు: చెన్నూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్ని వర్గాలను మోసగిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, జూలై 12: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తోందని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి వెంకటేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిం దన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై, సిద్దిపేటలో లాయర్‌పై పోలీసులు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడే ప్రభుత్వాలు కూలిపోవడం ఖాయమన్నారు. నాయకులు రమేష్, సతీష్, సురేష్, చరణ్, మహేష్, ఆకాష్ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

సిర్పూర్(టి), జూలై 12: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం సిర్పూర్(టి) మండలకేంద్రంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలి స్టులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో జర్నలిస్టులు నాజీర్‌అలీ, సంతోష్, అబ్దుల్ జమీల్, కృష్ణ, రాజాగౌడ్, శ్రీకాంత్, ధనుం జయ్, సంతోష్, శంకర్, రాజశేఖర్, కబీర్, దాస్, రవీందర్, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న బ్యాంకు సిబ్బందికి సన్మానం

వాంకిడి, జూలై 12: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న క్యాషియర్ బాగ్మారే, ఫీల్డ్ ఆఫీసర్‌రవితోపాటు సిబ్బంది అనిల్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఐకేపీ అధికారులు వారిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్ విష్ణువర్ధన్, ఏపీఎం మహేష్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు క్యాషియర్ రవి ప్రమోషన్‌పై ఆదిలాబాద్ జిల్లా సుంకిడికి బదిలీకాగా శుక్రవారం బీజేపీ నాయకుడు ధనుంజయ్ ఆయనను ఘనంగా సన్మానించారు.

హుస్సేన్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్య

మంచిర్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రచయిత, సామాజిక కార్యకర్త మహ్మద్ హుస్సేన్‌ను పోలీసులు అరెస్టు చేయడం హేయమైన చర్య అని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సికాస వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన హుస్సేన్ వివిధ స్థాయిల్లో పనిచేసి జైలు జీవితం అనంతరం సామాజిక కార్యకర్తగా జీవనం గడుపుతున్నారని తెలిపారు. 73 ఏళ్ల వయోవృద్ధుడు, అనారోగ్యంతో బాధపడుతూ జీవనం సాగిస్తున్నాడని పేర్కొన్నారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని పక్కదారి పట్టించడానికి, కార్మికుల్లో భయాందోళనలు సృష్టించడానికి రామగుండం కమిషనర్ మహ్మద్ హుస్సేన్‌ను జమ్మికుంటలో అరెస్టు చేసి, సికాస నాయకుడు రమాకాంత్‌ను అరెస్టు చేశామని ప్రకటించాడని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికులపట్ల మొసలి కన్నీరు కారుస్తూ హిందూత్వ మతోన్మాదులకే మద్దతునిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్రమ అరెస్టులు, ఎన్‌కౌంటర్‌లు కొనసాగుతున్నాయని, వెంటనే ఆపివేయకపోతే ప్రజల చేతిలో శిక్షతప్పదని హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం, జూలై 12 : మండలంలోని కొమ్ముగూడ నుంచి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి ఆటో ట్రాలీలో తరలిస్తున్న 12 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని, ట్రాలీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ కొమ్ముగూడలో పెట్రోలింగ్ చేస్తుండగా ఆటో ట్రాలీలో రేషన్ బియ్యం తరలిస్తుండగా వెంబడించి పట్టుకున్నామన్నారు. డ్రైవర్ ఆటో ట్రాలీని ఆపి పరారైనట్లు తెలిపారు.

అన్నదాన సత్రానికి భూమి పూజ

దండేపల్లి, జూలై 12: గూడెంగుట్ట అయ్యప్పస్వామి మందిరంలో అన్నదాన సత్రం నిర్మాణానికి శుక్రవారం ఆలయ వ్యవస్థాపకులు, గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమచార్యుల దంపతులు భూమి పూజ చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో గోవులకు పూజలు చేశారు. భక్తులు భూమి పూజలో పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బెల్లంపల్లి(తాండూర్), జూలై 12: సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ గజానంద్‌లు సూచించారు. శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, డ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు.

తాండూర్ గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి తపాస్ ఇంటింటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్, జూలై 12: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మికులు శుక్రవారం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో ఆటోలకు గిరాకీ తగ్గిందన్నారు. డ్రైవర్‌కు నెలకు రూ.12వేల జీవన భృతి, 50సంవత్సరాలు పైబడిన డ్రైవర్లకు పెన్షన్ సౌకర్యం అమలు చేయాలన్నారు. ఏ కారణంతో మరణించినా కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. ఆటో డ్రైవర్స్ ఓనర్స్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెల్ల విక్రమ్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్, నస్పూర్ కాలనీ, సీసీసీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, సుధాకర్, నాయకులు శేఖర్, రాజేశ్, శఫీ, వెంకటేశ్, పాల్గొన్నారు.

మత్తడి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాసిపేట, జూలై 12 : చిన్న ధర్మారం శివారులో సర్వే నెంబరు 19లో ఉన్న చెరువు తూము మత్తడిని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన తెలిపారు. రైతు గొడిసెల భీమయ్య మాట్లాడుతూ మత్తడిని స్థానిక నాయకుడు గురువారం ధ్వంసం చేయడంతో నీరంతా వృథాగా పోయిందన్నారు. రెండేళ్ళుగా ఇలాగే చేయడంతో తమ భూములు బీడువారి పోతున్నాయన్నారు. అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. చెరువు భూమి నాదేనని మత్తడి తూములను ధ్వంసం చేస్తున్నాడన్నారు. రైతులు బాపు, కృష్ణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


సుమన్ (ఫైల్)

దండేపల్లి, జూలై 12: లింగాపూర్ గ్రామానికి చెందిన జర్పుల సుమన్ (31) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమన్ తాళ్లపేటలో మినరల్ ప్లాంటు నిర్వహిస్తున్నాడు. తాళ్ళపేటకు చెందిన నిజాం అనే వ్యక్తి వద్ద సుమన్ అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని, లేకుంటే ప్లాంటుకు తాళం వేస్తాననడంతో సుమన్ మనస్తాపంతో పురు గుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

కల్వరి చర్చి నిర్వాహకులపై కేసు నమోదు

కాసిపేట, జూలై 12: బాలికను హింసించిన కేసులో కల్వరి చర్చి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మే 16న హైద్రాబాద్‌లోని నీలోఫర్‌లో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న 7 ఏండ్ల చిన్నారికి మిరాకిల్ హీలింగ్ షో ద్వారా నయం చేస్తామని పాస్టర్ ప్రవీణ్ షారోన్‌లు హైద్రాబాద్‌లోని కల్వరి చర్చికి తీసుకువెళ్ళాడు. షోలో నడిపించిన వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారని, క్రూరంగా హింసించారని, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కల్వరీ చర్చి నిర్వాహకులు ప్రవీణ్, షారోన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తాం

బెల్లంపల్లి, జూలై 12 : పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్‌లోని షెట్టర్‌లను పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. న్యాయ పరంగా అర్హులైన ప్రతి ఒక్కరికి కూరగాయల మార్కెట్‌లో షెట్టర్లు దక్కుతాయని సూచించారు.

సొంత డబ్బులతో రహదారి బాగు చేసుకున్న రైతులు

దండేపల్లి,జూలై 12: వెల్గనూర్ నుంచి అందుగులపేట రోడ్డుపై గుంతలను శుక్రవారం రైతులు సొంత డబ్బులతో పూడ్చివేశారు. పొలాలకు వేళ్లే రోడ్డుపై గుంతలు పడి వర్షం నీరు నిల్వడంతో ఇబ్బందులు పడుతున్నారు. వెల్గనూర్ చెందిన కొందరు రైతులు మొరం పోసి ట్రాక్టర్ ద్వారా చదును చేయించారు. మాజీ సర్పంచు శంకరయ్య, మాజీ ఉప సర్పంచు లక్ష్మణ్, రైతులు రాజయ్య, శేఖర్, సత్తయ్య, మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

రామకృష్ణాపూర్, జూలై 12: రామాలయం చౌరస్తాలో డ్రైనేజీ పూడుకుపోవడంతో శుక్రవారం సిబ్బంది మరమ్మతు చేశారు. మెయిన్ రోడ్డుపై నడిచే వారికి ఇబ్బందికరంగా ఉండడంతో కౌన్సిలర్ పుల్లూరిసుధాకర్ సింగరేణి అధికారులకు తెలియజేయడంతో మరమ్మతు చేయించారు.

సింగరేణిలో 'కార్డు'ల లొల్లి

- ప్రమాదాలపై పసుపు, రెడ్ కార్డుల ప్రదర్శన
- చార్జిషీట్లు, సస్పెండ్లు, ఇంక్రిమెంట్ల కోత
- వ్యతిరేకిస్తున్న సంఘాలు, కార్మికులు

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణిలో యెల్లో, రెడ్ కార్డుల లొల్లి నడుస్తోంది. రక్షణ విషయంలో సింగరేణి గనుల్లో యెల్లో, రెడ్ కార్డు అమలు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. గనిలో ప్రమాదాలు జరిగినప్పుడు బాధ్యులుగా భావించిన వ్యక్తికి మూడు సార్లు యెల్లో కార్డు జారీ చేస్తారు. నాలుగో సారి రెడ్‌కార్డు అమలు చేస్తారు. ఇందులో భాగంగా చార్జిషీట్, సస్పెన్షన్, ఇంక్రిమెంట్ కోత అమలు చేయవచ్చు. దీనివల్ల ప్రమాదాలు తగ్గుతాయని భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్పత్తి లక్ష్యాలతో పరుగులే

యాజమాన్యం కొన్నేండ్లుగా యేటా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుకుంటూపోతోంది. గత ఆర్థిక సంవత్సరం 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కాగా, ఈ ఆర్థిక సంవత్సరం 100 మిలియన్ టన్నులుగా ఉంది. ఇందులో భాగంగా బొగ్గును వెలికితీయాలని టార్గెట్లు నిర్దేశిస్తోంది. దీనివల్ల మైనింగ్ స్టాఫ్, సిబ్బంది యాజమాన్య ఆదేశానుసారం తమ పరిధిని మించి పనిచేయాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రమాదం జరిగినా బాధితుడికి ప్రైవేటుగా వైద్యం అందిస్తూ రిపోర్టు లేకుండా చేస్తున్నారు. ప్రమాదాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోంది.

పదేండ్లుగా రక్షణ సమావేశాలేవి?

పదేండ్లుగా రక్షణ కమిటీ సమావేశాలు ఏరియా, గనుల స్థాయిలో జరగడం లేదు. నామమాత్రంగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. రక్షణ సూత్రాల అమలు, నిర్వహణ విషయంలో ఉపన్యాసాలు ఇచ్చి వదిలిపెడుతున్నారు. రక్షణ పరికరాలు అందుబాటులో ఉండడం లేదు. నాసిరకం పనిముట్లు అందిస్తున్నారు. రక్షణ, పనిముట్ల విషయంలో పట్టింపు లేని యాజమాన్యం ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం ఏమిటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ఒక తప్పిదానికి రెండు శిక్షలా ?

గనిలో ప్రమాదం జరిగినప్పుడు కోల్‌మైన్స్ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం సూపర్‌వైజర్ స్టాఫ్‌పై చర్యలు తీసుకుంటున్నారు. యెల్లో, రెడ్‌కార్డు విధానంతో మరో చర్య తీసుకుంటే తమ పరిస్థితి ఏమిటని మైనింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రొడక్షన్ ఒత్తిడి, మరోవైపు ప్రమాదం జరిగితే శిక్ష.. రెండింటిని తాము భరించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. సిఎంఆర్-2017, కోడ్ ఆఫ్ డిసిప్లైన్‌లో కనిపించని కొత్త నిబంధనను ఎక్కడి నుంచి తీసుకువచ్చారో తెలియడం లేదన్నారు.

ఎవరినీ సంప్రదించకుండానే...

యెల్లో, రెడ్ కార్డుల అమలు నిర్ణయం యాజమాన్యం ఏకపక్షంగా తీసుకుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్మిక సంఘాలను సంప్రదించకుండానే సర్క్యులర్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. కార్మికుల్లో వ్యతిరేకత ఏర్పడి ఉత్పత్తిపై ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నాయి. యాజమాన్యం స్పందించి యెల్లో, రెడ్ కార్డుల అమలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 12: ధరణితోపాటు వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు అందించే దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో భూసమస్యలపై అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్డీవో రాములు , సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

లక్సెట్టిపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచి నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం పోతపెల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిందని, విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి ప్రగతిని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలు, వసతుల గురించి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారుల పని తీరును ఆరా తీశారు. తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీడీవో సరోజ, ఎంపీవో అజ్మత్ అలీ, వైద్యాధికారి శ్రీనివాస్,ఏఈవో వెంకటరమణ, ఈసీ స్వామి, రాజన్న, కార్యదర్శులు రాజశేఖర్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధిలో భాగంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో డీఈవో యాదయ్య, అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తాగునీరు, విద్యుత్ మూత్రశాలలు, అవసరం మేరకు అదనపు తరగతి గదులు ఏర్పాటు చేయాలని, మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మంచిర్యాలలో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఏసీసీ, జూలై 12: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ అన్నారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా 7వ వార్డులో ప్రజలకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఆయన మాట్లాడుతూ పగటిపూట కొట్టే దోమల వల్ల డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయని, నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇండ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. కౌన్సిలర్‌లు బదావత్ ప్రకాష్, శ్రీరాముల సుజాత, అధికారులు చంద్రయ్య, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: మున్సిపాలిటీలో డ్రై డే నిర్వహించారు. 10వ వార్డులోని పలు నివాస గృహాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోసారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయని మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్‌లు అన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కౌన్సిలర్ సీపతి సుమతిమల్లేష్, ఆర్‌ఓ సతీష్, ఆర్‌ఐ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత పేర్కొన్నారు. డ్రైడేలో భాగంగా 23, 27 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది చేత పారిశుధ్య పనులను చేయించారు. కౌన్సిలర్లు రవి, పద్మావతి, రమేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: ఇండ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎంపీడీవో రాథోడ్ రాధ సూచించారు. ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ రజిత, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మామిడిగట్టులో ఎంపీడీవో రాజేశ్వర్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

ఏసీసీ, జూలై 12: మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, సీఐ బన్సీలాల్ అన్నారు. శుక్రవారం శ్రీచైతన్య లక్ష్మీనగర్ పాఠశాలలో నిర్వహించిన గ్రీన్ ఇండియా మిషన్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. 50 మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఏజీఎం రాజు, ప్రిన్సిపాల్ ఆయూబ్, నాగరాజు, జయశ్రీ, ప్రియాంక పాల్గొన్నారు.

జన్నారం: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కలమడుగు ఉన్నత పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందన్నారు. చెట్లు కాలుష్యాన్ని నియంత్రిస్తాయన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మామిడిగట్టులో మొక్కలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రీన్ డే

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 12 : మంచిర్యాల పట్టణంలోని స్మార్ట్‌కిడ్స్ పాఠశాలలో శుక్రవారం గ్రీన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ ఫ్రూట్స్‌వెజిటేబుల్స్ డ్రెస్సులతో ప్రదర్శన నిర్వహించి అలరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు అలవాటు కావద్దు


మాట్లాడుతున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేటరూరల్, జూలై 12: యువత మత్తు పదార్థాలకు అలవాటు కావద్దని సీఐ నరేందర్ పేర్కొన్నారు. గోదావరి రోడ్డు వీకర్ సెక్షన్ కాలనీలో శుక్రవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 బైకులు, 2 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎస్ఐలు సతీష్, తానాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి: నీల్వాయి కస్తూర్బా విద్యాలయంలో ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే షీటీంకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కేజీబీవీ ఎస్‌వో మయూరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెన్నెల: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. కుశ్నపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'టాస్క్‌శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి'

బెజ్జూరు, జూలై 12: టాస్క్ నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ రీజనల్‌సెంటర్ మేనేజర్ సాయికుమార్ అన్నారు. శుక్రవారం బెజ్జూరు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్‌శిక్షణపరంగా ఎదగడానికి దోహదపడుతుందన్నారు. కంప్యూటర్ పరమైన శిక్షణలు ఉచితంగా నేర్పించి ఉపాధి అవకాశాలు చూపిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మారుతి, సునీత, శారద పాల్గొన్నారు.

బంబార ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

వాంకిడి, జూలై 12: మండలంలోని బంబార గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నతపాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పిల్లలకు దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు తదితర సీజనల్ వ్యాధులపై హెచ్ఈవో రవిదాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, ఆశాకార్యకర్తలు ఉపాధ్యాయులున్నారు.

ఘనంగా నాబార్డు ఆవిర్భావ దినోత్సవం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 12: నాబార్డు ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని వాసన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పర్శనంబాల గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలలో మొక్కలునాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వాసన్‌సిబ్బంది జయవర్ధన్, తిరుపతి, భీందాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వేషధారణలో నిరసన

తిర్యాణి, జూలై 12: మండలంలోని కుమరంభీం చౌరస్తాలో పెందూర్ ధర్ము శుక్రవారం మండలంలోనెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గాంధీ వేషధారణలో నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎనిమిది రోజుల క్రితం కలెక్టర్ మండలంలో పర్యటించగా ఆయన దృష్టికి రోడ్లు, వైద్యం, విద్య, తదితర సమస్యలను విన్నవించినా పరిష్కరించలేదని పేర్కొన్నాడు.

'రూ.25లక్షల బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలి'

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12: కేజీబీవీ, మోడల్‌స్కూల్,అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు రిటైర్మెంట్ తరువాత రూ.25 లక్షల బెనిఫిట్స్, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రఫతుల్లాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, పోషన్న, తిరుపతి, నితీన్, హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నాసిరకం పనులతో కుంగిపోతున్న నిర్మాణం

కెరమెరి, జూలై 12: మండలంలోని ఇందాపూర్, చిత్తగూడ గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా రూ.20లక్షల నిధులో నిర్మిస్తున్న భవన సముదాయం నాసిరకంగా నిర్మిస్తుండడంతో కూలిపోయే ప్రమాదం ఉందని మాజీ ఎంపీపీ మోతీరాం పేర్కొన్నారు. శనివారం భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కోలాం గిరిజనుల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం రూ.20లక్షల నిధులతో బహుళప్రయోజన సముదాయాన్ని చిత్తగూడ,ఇందాపూర్‌లో నిర్మిస్తున్నారు. ఇటీవల కురిసినవర్షాలకు బిల్డింగ్ సముదాయం కుంగిపోయిందన్నారు.

పప్పు దినుసుల సాగుపై రైతులకు శిక్షణ

జైనూర్, జూలై 12: మండలంలోని ఉషేగాంలో శుక్రవారం రైతు లకు పప్పు దినుసులైన కంది, పెసర్ల సాగుపై శిక్షణ కల్పించారు. అదేవిధంగా సాగుకోసం కంది, పెసర్లు తదితరవిత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిడబ్ల్యూసీ సంస్థ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో గేడాం గౌరుబాయి, పెందూర్ యశోదబాయి, శ్యాంల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ను కలిసిన గుస్సాడి బృందం

జైనూర్, జూలై 12: హైదరాబాదులోని రవీంద్రభారతిలో రాష్ట్ర భాష సాంస్కృతికశాఖడైరెక్టర్ మామిడి హరికృష్ణను శుక్రవారం మండలంలోని మార్లవాయి పద్మశ్రీగుస్సాడి బృందంసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్నరోజుల్లో గుస్సాడి కళకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు.

ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం: ఎస్పీ


కౌటాలలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్


ఎస్పీని సన్మానిస్తున్న బ్రాహ్మణ సంఘంనాయకులు

కౌటాల, జూలై 12: ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన షణ్ముక హాస్పిటల్ సహకారంతో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే యువతకు వాలీబాల్, గ్రామస్థులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహకశక్తులకు సహకరించవద్దన్నారు. యువత ప్రలోభాలకు లొంగిపోయి మోసపోవద్దని, భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. మావోయిస్టుల కోసం ఇక్కడి ప్రజలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయమన్నారు. గ్రామాల్లో కొత్తవ్యక్తులు వచ్చినా, సంచరించినా పోలీసులకు సమాచారం అందించలన్నారు. డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ పోలీసులు ఎల్లప్పుడు మీ కోసం అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం ఎస్పీ200బ్లాంకెట్స్5వాలీబాల్‌కిట్స్, 30హెల్మెట్‌లను, 60 గ్రోసెరీస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ సాదిక్ పాషా, ఎస్సైలు మధుకర్, నరేష్, షణ్ముక హాస్పిటల్ డాక్టర్ల బృందం, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక టీంలు

ఆసిఫాబాద్: జిల్లాలో పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణకు పది మంది పోలీసుసిబ్బంది చొప్పున రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ రెండు టీంలు ఆసిఫాబాద్ టౌన్, కాగజ్‌నగర్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పనిచేస్తాయని తెలిపారు. ప్రత్యేక టీం ద్వారా వెహికల్ చెకింగ్ నిర్వహిస్తామన్నారు.

ఎస్పీని సన్మానించిన బ్రాహ్మణ సంఘం నాయకులు

ఆసిఫాబాద్ రూరల్: ఎస్పీ శ్రీనివాసరావును శుక్రవారం బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్‌కుమార్, సుగుణాకర్‌రావు, రవీందర్, సతీష్, శేషగిరి, శేఖర్, సంతోష్, ప్రతాప్, సాయి, శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు, నిత్యావసర సరుకుల పంపిణీ

పోలీసులు మీ కోసం కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వాంకిడి మండలం టోకిగూడ గ్రామానికి చెందిన బాధితురాలు రాజక్కకు రూ.5వేల నగదుతోపాటు నిత్యావసర సరుకులను ఎస్పీ శ్రీనివాసరావు పంపిణీ చేశారు. రాజక్క గతంలో జంతువుల కోసం అమర్చిన కరెంటు తీగలు తగిలి కిందపడడంతో చూపు కోల్పోయింది.

దారి తప్పిన గురువులు..

ఆసిఫాబాద్ రూరల్, జూలై 12: గురువులనే వారు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలి. ఎంత కోపం వచ్చినా దిగమింగుకొని సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. కానీ మండలంలోని ఓపాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య గొడవ జరగగా చెప్పులు ఎత్తారు. ఈ సంఘటన ఆసిఫాబాద్ మండలం సాలెగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసు కుంది. పాఠశాలలో 87మంది విద్యార్థులకు గాను అయిదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. మంతెన ఆనంత్ ఈనెల 31న పదవీ విరమణ పొందనుండడంతో ఇన్‌చార్జి హెడ్మాస్టర్‌గా కోట తిరుపతి వ్యవహరిస్తున్నారు. ఇటీవల డీఈవో కార్యాలయం నుంచి అదే పాఠశాలలో పనిచేస్తున్న కైలాస్ అనే ఉపాధ్యాయుడికి మండలంలోని చిలాటిగూడ గ్రామానికి డిప్యూటేషన్ పంపించాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. జూనియర్లు ఉండగా తననే డిప్యూటేషన్ ఎందుకు పంపిస్తున్నారని అని ఇన్‌చార్జి హెడ్మాస్టర్ తిరుపతి, కైలాస్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ గొడవ మధ్యలో అనంత్‌అనే ఉపాధ్యాయుడు కలుగజేసుకోవడంతో అనంత్, తిరుపతి మధ్య వాగ్వాదం చోటు చేసుకుని చెప్పులు పైకెత్తారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఇతర ఉపాధ్యాయులు వారిద్దరినీ సముదాయించారు. ఏదీ ఏమైనప్పటికీ ఉపాధ్యాయులు ఇలా చెప్పులతో కొట్టుకోవడం స్థానికంగా చర్చనీయాంశం అయింది.

యువతి అదృశ్యం: కేసు నమోదు

వాంకిడి, జూలై 12: వాంకిడి పోలీసు స్టేషన్ పరిధిలోని ఖమాన గ్రామానికి చెందిన యువతి(20) అదృశ్యమైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. యువతి హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌లోని ఓ కాలేజీలో బీఎస్సీనర్సింగ్ మూడో సంవత్సరం చదువుతోందన్నారు. మేనెలలో సెలవులకు ఇంటికి వచ్చింది. అయితే జూన్ 25న ఉదయం 11గంటలకు ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెకోసం గాలించినా ఫలితం లేకపోయింది. హైదరాబాద్‌కు చెందిన అరవింద్ అనే యువకుడితో వెళ్లి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


ఆకాష్(ఫైల్)

దహెగాం(పెంచికలపేట), జూలై 12: పెంచికలపేట మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో గురువారం రాత్రి సిడాం ఆకాష్ (23) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కొమురయ్య తెలపారు. ఆయనతెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికిచెందిన ఆకాష్ మంచిర్యాలలో డిగ్రీ చదువుతూ పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. ఇటీవల ఎస్ఎస్‌సీ(కానిస్టేబుల్) ఫలితాలు వెలువగా ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో మనస్థానానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తుజరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

చింతలమానేపల్లి, జూలై 12:మండలంలోని బాబాసాగర్ గ్రామశివారులో వాహనాల తనఖీల్లో భాగంగా రూ.4382విలువ గల గుట్కాప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సైనరేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన సయ్యద్‌అజిత్ అలీ ద్విచక్రవాహనం (టీఎస్ 20డీ0861)పై గుట్కాప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతన్ని విచారించగా కాగజ్‌నగర్‌కు చెందిన ఇంత్యాజ్ నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు గుట్కా ప్యాకెట్లు, వాహనం సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తరగతులు బహిష్కరించి విద్యార్థుల నిరసన


పాఠశాల ఆవరణలో కూర్చుని నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 12: తమసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బూర్గుడ పాఠశాలకు చెందిన విద్యార్థులు తరగతులను బహిష్కరించి పాఠశాల ఎదుట కూర్చుని ధర్నా నిర్వహించారు. గణిత టీచర్ అసభ్యకరమైన మాటలతో వేధిస్తున్నా రని, ఇష్టానుసారంగా తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు టీచర్‌వద్దు అంటూ పట్టుబట్టారు. హెచ్ఎం సంబంధిత గణిత టీచర్ వచ్చి విద్యార్థులకు క్షమాపణ తెలిపారు. గణితం సబ్జెక్టుకు మరో టీచర్‌ను కేటాయించామని హెచ్ఎం తెలపడంతో విద్యార్థులు క్లాస్‌లకు వెళ్లారు.

పెన్షన్ పెంపు అమలు చేయాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌సీ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌పెంచి పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ పెంచుతామని హామి ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. వెంటనే ఇచ్చిన హామిని నిలబెట్టు కోవాలని కోరారు. కార్యక్రమంలో రేగుంట కేశవరావు, లింగమూర్తి, విక్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

మొహర్రం ఉత్సవాల్లో భాగంగా 5వరోజు పంజా సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి తనభర్త సోనేరావు, కుమారుడు సాయినాథ్‌తోట కలిసి జిల్లాకేంద్రంలోని తననివాసంలో పీరీలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొహర్రం వేడుకలను కులమతాలకు అతీతంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్పీలు

ఆసిఫాబాద్, జూలై 12: సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడుతూ 2023 సెప్టెంబరు 13న వరంగల్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న రిలేదీక్ష శిబిరాన్ని సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ మాట నిలబెట్టుకో వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, సందీప్, దేవేందర్, మహేశ్వర్‌నగేష్, సుభాష్, శ్రీనివాస్, స్వప్న, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి



ఎస్పీఎంలో యాజమాన్యం తీరుతో విసుగెత్తిన కార్మికులు యూనియన్ ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తున్నారు. యూనియన్ లేకపోవడంతోనే యాజమాన్యం ఆడిందే ఆటగా సాగుతోందంటున్నారు. యూనియన్ ఏర్పడితేనే తమకు గుర్తింపు ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికల ఏర్పాటుపై కార్మికుల్లో ఉత్కంఠ నెలకొంది.

- డిమాండ్ చేస్తున్న ఎస్పీఎం కార్మికులు
- ఏర్పాట్లు చేయాలని లేబర్ అధికారులను కలిసిన నాయకులు
- పునఃప్రారంభం తర్వాత ఎన్నికల ఊసే లేని వైనం

కాగజ్‌నగర్, జూలై 12: ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికల కోసం కార్మికులు నిరీక్షిస్తున్నారు. 2014సెప్టెంబరు 27న యాజమాన్యం షట్‌డౌన్ పేరిట ఎస్పీఎంను మూసివేసిన తర్వాత కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. అనంతరం 2ఆగస్టు 2018జేకే యాజమాన్యం ఆధ్వర్యంలో మిల్లు పునఃప్రారంభమైంది. కానీ అంతకుముందు మిల్లులో పని చేసే కార్మికులను పూర్తి స్థాయిగా ఉద్యోగాల్లోకి తీసుకోలేదు. దీంతో వారు దశల వారీగా పోరాటాలు చేస్తున్నారు. అయితే తమకు ట్రేడ్ యూనియన్ ఎన్నికలు పెట్టాల్సిందేనని మిల్లులో పనిచేస్తున్న కార్మికులు పేర్కొంటున్నారు. పదిహేను రోజుల క్రితం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ ఆధ్వర్యంలో లేబర్ అధికారులను కలిసి ఎస్పీఎంలో ఎన్నికల నిర్వహించాలని కోరారు. అలాగే పలు కార్మిక సంఘాలు కూడా వరంగల్‌లోని కార్మికశాఖ అధికారులను కలిసి ట్రేడ్‌యూనియన్ ఎన్నికలపై చర్చించారు.

మారుతున్న పరిస్థితులు..

ఎస్పీఎం పునరుద్ధరణ తర్వాత రోజురోజుకు పరిస్థితులు మారి పోతున్నాయి. పర్మినెంటు కార్మికులను పూర్తిస్థాయిలో తీసుకోలేదు. యాజమాన్యం స్థానికేతరులకు పనిలోకి తీసుకుంటోందని కార్మిక సంఘాలు యాజమాన్యంపై మండిపడుతున్నాయి. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలివ్వాలన్న సదుద్దేశ్యంతో మిల్లును పునఃప్రారంభిస్తే జేకే యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. స్థానికేతరులకు అధిక జీతాలు, స్థానికులకు తక్కువ జీతాలిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కార్మిక సంఘాలు జేకే యాజమాన్యంపై తీరుపై మండిపడుతున్నాయి. కార్మికులపై పనిఒత్తిడి, యాజమాన్య వేధింపులు అధికమవుతున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. మిల్లులో ట్రేడ్ యూనియన్ లేకపోవటంతోనే యాజమాన్యం తీరు పెచ్చుమీరుతోందని కార్మికులు భావిస్తున్నారు. దీంతో తమకు ఎన్నికలు పెట్టాల్సిందేనని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కార్మిక సంఘాలు లేకపోవటంతో జేకే యాజమాన్యం ఆడిందే ఆట, పాడిందే పాటగా మారుతుందోని కార్మికులు పేర్కొంటున్నారు.

మిల్లు పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసినా పొగ అంతా ఇళ్లలోకి చేరి పట్టణవాసులే అధికంగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. అయినప్పటికీ ఇక్కడి వారికి ఏ మాత్రం న్యాయం చేయకుండా యాజమాన్యం ఒంటెద్దు పోకడలు పోవటం సరి కాదని మండిపడుతున్నారు. ఇన్నాళ్లు మిల్లులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించకపోవటం, లేబర్ అధికారులు కూడా ఇటువైపు చూడకపోవటంపై కార్మికులు మండిపడుతున్నారు. కార్మికులపై యాజమాన్యం మొండి వైఖరి నశించాలంటే ట్రేడ్ యూనియన్స్ ఉండాల్సిందేనని కార్మికులంతా డిమాండు చేస్తున్నారు.

ఎస్పీఎంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు పెట్టాల్సిందే..



కొంగ సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

ఎస్పీఎంలో ఎన్నికలు పెట్టాలని పదిహేను రోజుల క్రితం లేబర్ అధికారులకు కలిసి వినతిపత్రాన్ని ఇచ్చాను. ఎన్నికలు లేకపోవటంతో యాజమాన్యం ఆడిందే ఆటగా మారుతోంది. కార్మికులపై పనిభారం మోపుతున్నారు. నూతనంగా వచ్చిన చట్టాలు అమలు పర్చటం లేదు. స్థానికేతరులకు అధిక జీతాలివ్వటం, ఇక్కడి వారికి తక్కువ జీతాలివ్వటం దారుణమైన విషయం. నిరసన తెలిపితే కార్మికులపై వేధింపులు అధికమవుతున్నాయి. జేకే మిల్లులో ఖచ్చితంగా ట్రేడ్ యూనియన్ ఎన్నికలు పెట్టాల్సిందే.

గులాబీ పార్టీకి పూర్వ వైభవం తీసుకరావాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జూలై 12: గులాబీ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో పలువార్డుల్లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమార్కుల కబంధహస్తాల్లో ఉన్న సిర్పూరు ప్రాంతాన్ని విముక్తి చేసేది కేవలం బీఆర్ఎస్ పార్టీ అన్నారు. ఇటీవల కాంగ్రెస్‌పార్టీలో చేరిన ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ తెలంగాణ ద్రోహిగా మిగిలినట్టు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీనాయకులు విద్యావతి రాజ్‌కుమార్, లెండుగురే శ్యాంరావు, నక్క శంకర్, ఆవుల రాజ్ కుమార్, కౌన్సిలర్‌మినాజ్, ముస్తాఫీజ్, నక్క మనోహర్, పోచం రేణికుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

కాగజ్‌నగర్, జూలై 12: జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయంచేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రకోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండు చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని పెన్షనర్స్ భవనంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పదోన్నతుల్లో భాగంగా మిగిలిపోయిన ఖాళీలను వెంటనే భర్తీచేయాలని డిమాండు చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు కూడా మంజూరు చేయాలన్నారు. సమావేశానికి టీఎస్‌యూటీఎఫ్ జిల్లాఅధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వైద్యశాంతికుమారి, సోయంఇందురావు,హేమంత్‌షిండే,రమేష్,రవికుమార్‌తదితరులు పాల్గొన్నారు.

అనాథలైన చిన్నారులు



తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు

జైనూర్, జూలై 12: మండలంలోని సంబాజీగూడలోని ఓ పేద కుటుంబాన్ని విధి వెంటాడింది. తల్లిదండ్రుల మరణంతో ఆ ఇంట్లో పిల్లల ఆలనపాలన చూసే వారు కరువయ్యారు. జాదవ్‌ప్రకాష్ అనే వ్యక్తికి భార్య, నలుగురు ప్లిలలున్నారు. 8నెలల క్రితం అతని భార్య మృతిచెందింది. పెద్దకూతురు ప్రస్తుతం పదవ తరగతి చదువుతోంది. మిగిలినపిల్లలు సైతం విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబపాలన చూస్తున్న తండ్రి జాదవ్‌ప్రకాష్ సైతం వారంరోజుల క్రితం వాగులో కొట్టుకొనిపోయి మృతిచెందాడు. దీంతో నలుగురు పిల్లలు అనాథలయ్యారు. తల్లిదండ్రుల మరణంతో పిల్లలు దిక్కుతోచని స్థితిలోఉన్నారు. స్వచ్ఛందసంస్థలు, అనాథాశ్రమాల వారు పిల్లలను ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రవిచంద్రకాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12: జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో సీఐ సతీష్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. నేరాల నిర్మూలన కోసం ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండలన్నారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, చిట్టిబాబు, ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్,సాగర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'అటవీఅధికారులపై చర్యలు తీసుకోవాలి'

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12: గిరిజనుల వద్ద డబ్బులు వసూలు చేసిన అటవీశాఖ మహిళా అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల ఐక్యకార్యచరణ సమితినాయకులు శుక్రవారంజిల్లా అటవీఅధికారికి వినతి పత్రం అందజేశారు. ఈనెల4న చోర్‌పల్లిప్రాంతంలో విధులు నిర్వహించే ఇద్దరు మహిళా అటవీశాఖ అధికారులు లింగాపూర్ మండలం లెండిగూడ గ్రామానికి చెందిన మరప సాగర్, మడావిరాము అనే ఇద్దరు ఆదివాసీ రైతుల ఇళ్లలో చొరబడి ఇంటికిపెట్టిన పాతతలుపులను పట్టుకుని కేసులు పెడుతామని భయభ్రాంతులకు గురిచేసి రూ.30వేలు వసూలు చేశారని అన్నారు. వెంటనేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రణయ్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 12: బీసీ సంక్షేమసంఘం యువజన విభాగం జిల్లాఅధ్యక్షుడిగా అవిడపుప్రణయ్‌ని నియమించారు. ఈమేరకు నియామక పత్రాన్ని సంఘం జిల్లాఅధ్యక్షుడు, అడ్వోకేట్ తుమ్మరమేష్ అందజేశారు. కార్యక్రమంలో గజ్జెలలక్ష్మణ్, వీరభద్రాచారి, సంతోష్, కోటేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన డీఈవో

కాగజ్‌నగర్, జూలై 12: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఈవో అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన కాగజ్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలుతాయన్నారు. గదుల సమీపంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వస్తే వెంటనే సమాచారమివ్వాలన్నారు. అలాగే విద్యార్థులకు నిర్ధేశించిన బ్రాండ్ సరుకులు మాత్రమే ఇవ్వాలన్నారు. ఇంటర్మీయేట్‌విద్యార్థులకు ఎంసెట్‌లక్ష్యంగా బోధనలు చేయాలని సూచించారు. ఆయనవెంట జిల్లా సైన్స్ అధికారి మధూకర్, పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్ బాబు, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

రెబ్బెన, జూలై 12: మండలంలోని పలుగ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రాజేశ్వరి, రుకుంబాయి నాటుసారా అమ్ముతుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ తెలిపారు. ఇద్దరిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు రమేష్, సంధ్యారాణి సిబ్బంది పాల్గొన్నట్టు వివరించారు.

జీరో బిల్లు రాని వారికి అవకాశం

కాగజ్‌నగర్, జూలై 12: కరెంటు జీరో బిల్లు రాని వారికి ప్రజాపాలన సేవకేంద్రంలో తప్పులను సరి చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు తెలిపారు. గృహజ్యోతి పథకంలో యూఎస్‌సీ నెంబరు ప్రజాపాలన దరఖాస్తులో తప్పులు రాసిన వారు సవరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



కాగజ్‌నగర్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

కాగజ్‌నగర్, జూలై 12: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో వివిధ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్ననేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వార్డుల్లో పారిశుధ్యపనులపై దృష్టిసారించాలన్నారు. కాచిచల్లార్చి వడపోసిన నీటినే తాగాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులను అన్నీ పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచాలన్నారు. ఆశ,ఆరోగ్యకార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై పరిశీలించాలన్నారు. అలాగే వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. పట్టణంలోని పారిశుధ్యం, తదితరాలపై మున్సిపల్ కమిషనర్ అంజయ్యను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేష్, తహసీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ..

కాగజ్‌నగర్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

భట్టుపల్లి పీహెచ్‌సీ పరిశీలన..

కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ తనిఖీచేశారు. సిబ్బం దిని వివిధ సమస్యలను అడిగితెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిబ్బంది అంతా కూడా అందుబాటులో ఉండాలన్నారు. అవసరం ఉన్న మందులను ముందస్తుగానే తెప్పించుకోవాలన్నారు.

రుచికరమైన భోజనం వడ్డించాలి: డీఈవో



దహెగాంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

దహెగాం(పెంచికలపేట), జూలై 12: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని డీఈవో అశోక్ అన్నారు. శుక్రవారం పెంచికలపేట మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. నిర్దేశించిన బ్రాండ్ సరుకులు వాడాలని సూచించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరా లను పరిశుభ్రంగాఉంచుకోవాలన్నారు. ఆయన వెంట పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, డీఎస్‌వో మదుకర్, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిక ఎదగాలి..

దహెగాం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈవో అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నరాస్పెల్లి జడ్పీఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ ఆఫ్ అట్లాంటా అండ్ సామివేని ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూరప్రాంతాల నుంచి వచ్చే 40మంది విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, ఈఎస్‌వో మధుకర్, హెచ్‌ఎం సునీత, నాయకులు ధనుంజయ్, సుధాకర్‌రావు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



'బడా కాంట్రాక్టర్ల నుంచి కాపాడండి'

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న బడా కాంట్రాక్టర్ల బారినుంచి తమను కాపాడాలని గోదావరిఖనికి చెందిన కాంట్రాక్టర్లు, సూపర్‌వైజర్లు నూనేటి సతీష్ కుమార్ యాదవ్, విరకంటి నరేందర్, కుర్మ సతీష్, సమ్మయ్య, రాజిరెడ్డి, రమేష్, రాయమల్లు, విజయ్‌కుమార్, నగేష్, తదితరులు పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. తాము ఆన్‌లైన్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి పనులు పొందామని, వాటిని చేయనివ్వకుండా తమతో సిండికేట్ కావాలని స్థానిక కాంట్రాక్టర్లు బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అంతేకాకుండా పనిచేసేచోట ఉన్న యంత్రాలు, సామగ్రి ఎత్తికెళ్లినట్లు ఆరోపించారు. కొన్నినెలలుగా పనులు చేయనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సింగరేణి సీఎండీ నుంచి కిందిస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశామని, కానీ తమకు న్యాయం జరగడం లేదని, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సింగరేణి, పోలీసుఅధికారులు స్పందించితమపై భౌతికదాడులు జరుగకుండా, పనులు కొనసాగేలా చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

పాన్‌కార్డు అనుసంధానంపై అవగాహన కల్పించండి: జీఎం

శ్రీరాంపూర్, జూలై 12: ఉద్యోగులకు పాన్‌కార్డు,ఆధార్‌కార్డు అనుసంధానంపై అవగాహన కల్పించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. వివిధఅంశాలపై పర్సనల్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు లింకుచేసుకోని ఉద్యోగులున్నారని, వారికి అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డిజిఎం (పర్సనల్) పి అరవిందరావు, డీవైపీఎంలు ఎస్ రాజేశ్వర్‌రావు, వి దేవేందర్ రెడ్డి, పాలకుర్తి రాజు, సునీల్, సీనియర్ పీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి'

మందమర్రిరూరల్, జూలై 12: రక్షణతోకూడిన ఉత్పత్తి సాధించాలని హైదరాబాద్ రీజియన్ డీఎంఎస్ నాగేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ సమావేశాన్ని ఎల్లందు క్లబ్‌లో జీఎం మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, బొగ్గు ఉత్పత్తి చేసే క్రమంలో రక్షణ సూత్రాలు పాటించాలని, రక్షణ పరికరాలు ధరించాలన్నారు.

జీఎం స్టోర్స్ ఎలిషాకు సన్మానం

మందమర్రిరూరల్, జూలై 12: జీఎంస్టోర్స్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా మందమర్రికి వచ్చిన ఎలీషాకు జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. మొక్కను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నైనీలో బొగ్గు తవ్వకానికి సహకరిస్తాం: ఒడిశా సీఎం



ఒడిశా సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎం, సింగరేణి సీఎండీ

శ్రీరాంపూర్, జూలై 12: ఒడిశాలో ఉన్న సింగరేణి బొగ్గుబ్లాకు నైనీలో బొగ్గు తవ్వకానికి సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాజీ హామీ ఇచ్చారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రాస్, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, తదితరుల బృందం శుక్రవారం ఒడిశా ముఖ్యమంత్రిని కలిశారు. అటవీశాఖతో పాటు ప్రైవేటు భూములను బదలాయించాల్సి ఉందని, వాటిని ఇస్తే మూడు నెలల్లోగా బొగ్గు తవ్వకాలు ప్రారంభిస్తామన్నారు. నైనీ బొగ్గుతో 1600(800+800) మెగావాట్ల విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేస్తామని చెప్పగా, ఆయన సరేనన్నారు. అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం 950 హెక్టార్లలో ఏర్పాటు చేయనున్న నైనీబ్లాకు ప్రాంతానికి వెళ్లిన బృందం నిర్వాసితులతో మాట్లాడి, వారికి పరిహారం, ఇతర వసతులు సమకూరుస్తామని హామీ ఇచ్చింది. ఈ పర్యటనలో ఇంధన శాఖ ఓఎస్‌డి సురేందర్ రెడ్డి, సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్, పా) ఎన్‌వికె శ్రీనివాస్, చెండిపడా నియోజకవర్గ ఎమ్మెల్యే అగస్తీ బెహెరా, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియాకు సోలార్ ప్లాంట్ మణిహారం

చెన్నూరు, జూలై 12: శ్రీరాంపూర్ ఏరియాకు సోలార్ పవర్ ప్లాంట్ మణిహారమని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూ రులో నిర్మిస్తున్న 11మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరులోని 2ఇంక్లైన్ ఉపరితలంలో 76ఎకరాల్లో 11మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ పనులను త్వరగా పూర్తిచేసి సోలార్ విద్యుత్‌ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులను, ఎన్రిచ్‌ఎర్త్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఆయన వెంట జీఎం సోలార్ జానకిరామ్, ఎస్‌వోటూ డైరెక్టర్ కేవీ రావు, అధికారులు విశ్వనాథ రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, అభిషేక్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు

నిజాయితీకి బహుమానం

శ్రీరాంపూర్, జూలై 12: జీఎం కార్యాలయంలో అసి స్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న రాంచందర్ ఈనెల11న లక్షా యాభైవేల రూపాయల విలువైన తనబంగారు గొలుసును ఆఫీసులో పోగొట్టుకున్నాడు. ఆగొలుసు పర్సనల్ విభాగంలో పనిచేస్తున్న చొప్ప దండి స్వామి అనే ఉద్యోగికి దొరికింది. రాంచందర్ గొలుసు పోయిందని తెలుసుకున్న స్వామి, ఆ వస్తువును అతనికి అందజేశాడు. స్వామి నిజాయితీని మెచ్చుకున్న జీఎం బి సంజీవరెడ్డి, కార్యాలయ సిబ్బం ది అతన్ని అభినందించి సత్కరించారు. రాంచందర్ సంతోషంతో గొలుసు ఇచ్చినస్వామికి 20గ్రాముల బరువున్న రెండు వెండికాయిన్లను బహుమతికి అందజేశాడు.

అద్దె వాహనాల కోసం టెండర్లకు ఆహ్వానం

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణిలో వివిధ రకాల అద్దె వాహనాలు నడుపుటకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీజీఎం (పర్సనల్) పి అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. అంబులెన్స్‌లు, జీపులు, పికప్ వ్యాన్లు, మొదలైనవి 17 వాహనాల అవసరం ఉందన్నారు. ఆసక్తిగల సింగరేణి భూనిర్వాసితులు, పరిసరప్రాంత ప్రజలు ఈనెల30వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు నిర్దేశిత ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఈనెల31వ తేదీ మధ్యాహ్నం 12గంటల లోపు తమ దరఖాస్తులను శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో అందించాలన్నారు. ఇతర వివరాలకు పర్చేజ్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

బెల్లంపల్లి ఏరియాలో జీఎం(ఈఅండ్‌ఎం) పర్యటన

కాగజ్‌నగర్, జూలై 12: బెల్లంపల్లి ఏరియాలో జీఎం(ఈఅండ్‌ఎం) స్టోర్స్ పి ఎలిసా పర్యటించారు. ఈ సందర్భంగా సెంట్రల్ స్క్రాప్ యార్డు ఏర్పాటు, స్క్రాప్ డిస్పోస్‌యార్డుపై అధికారులకు సూచనలు అందజేశారు. స్టోర్‌లో అవసరానికి, యంత్రాలు నడవటానికి సంబంధించిన పరిమితమైన స్టాక్‌ను మాత్రమే నిల్వఉంచాలని సూచించారు. ఈసందర్భంగాసిబ్బంది జీఎం(ఈఅండ్‌ఎం) పి ఎలిసాను సన్మానించారు.

సింగరేణి శిక్షణకు శ్రీరాంపూర్ నాయకులు

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణి ఆధ్వర్యంలో 'ప్రాజెక్టులు, బొగ్గు ఉత్పత్తి, భవిష్యత్ అవసరాలు' అనే అంశంపై శుక్రవారం కొత్తగూడెంలోని ఇల్లందు క్లబ్‌లో పలుయూనియన్ల బాధ్యులకు శిక్షణ అందించారు. ఈశిక్షణకు శ్రీరాంపూర్ ఏరియా నుంచి ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి వి అనిల్‌రెడ్డి హాజరయ్యారు.

'బొగ్గు బ్లాకులు సింగరేణికే ఇవ్వాలి'

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను సింగరేణికే ఇవ్వాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య అన్నారు. జీఎం కార్యాలయం ఎదుట ఆ యూనియన్ చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారంతో ఐదోరోజుకు చేరాయి. ముఖ్య అతిథిగా వీరభద్రయ్య హాజరై మాట్లాడారు. గోదావరి పరివాహక ప్రాంతంలో లభించే బొగ్గు నిక్షేపాలను ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కారుకూరి నగేష్, లింగం రవి, మిరియాల రాజేశ్వర్‌రావు, పిట్ కార్యదర్శులు సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌కంటాక్స్ ఫైలింగ్ యాజమాన్యమే చేయాలి'

శ్రీరాంపూర్, జూలై 12: సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన ఇన్‌కంటాక్స్ ఫైలింగ్ యాజమాన్యమే చేయాలని టీబీజీకేఎస్ ప్రధానకార్యదర్శి కె సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టెం లక్ష్మణ్ కోరారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. 2023-24ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన ఫారం-16, ఫారం-10ఈ సకాలంలో అందకపోవడం, భర్తీచేసిన వాటిలో తప్పిదాలు దొర్లడం వల్ల ఉద్యోగులు గందరగోళానికి గురికావాల్సి వచ్చిందన్నారు. యాజమాన్యం చొరవ తీసుకొని వాటిని సవరించి, ఫైలింగ్‌ను అన్ని గనులు, విభాగాలలో చేయించాలని కోరారు. సమావేశంలో నాయకులు బండి రమేష్, పొగాకు రమేష్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, గడ్డం మైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

'బ్యాంకు ఖాతా తీసుకోవాలి'

శ్రీరాంపూర్, జూలై 12: కాంట్రాక్టు ఉద్యోగులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా తీసుకుంటే పలు ప్రయోజనాలున్నాయని ఆర్కే5 గని మేనేజర్ ఎండి అబ్దుల్ ఖాదిర్ అన్నారు. గనిలో పనిచేసే 15మంది కాంట్రాక్టు ఉద్యోగులకు శుక్రవారం గని ఆవరణలో బ్యాంకు ఖాతాలు ఇప్పించారు. కార్యక్రమంలో రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్‌పాల్గొన్నారు.